కనకపు సింహాసనం

● బలివాడ కాంతారావు

వీళ్ల నలుగురూ నెత్తిమీద బాధ్యత బరువుతో నిత్యం నలిగిపోయే పరిపాలకులు. పారిశ్రామిక సంస్థల పరిపాలన వ్యవహారాలు చర్చించడానికి యేర్పరచిన సెమినార్‌లో పాల్గొనడానికి రాజధానికి వచ్చారు. ఈ ఫైవ్‌స్టార్ హోటల్లో ఓ సాయంత్రం నాలుగు గదులనించీ నాలుగు కుర్చీలు లాక్కొని వరండాలోనికి వచ్చారు. నిత్యం చక్రాల రణగుణ ధ్వనులనించి ఒక్క నాలుగు రోజులు ప్రశాంత వాతావరణంలోనికి!

మిగతా ముగ్గురూ సరదాకు ఆడినా రామచంద్రరావుకు యీ జీవంలేని పేక ముక్కల్లో ఒకరీతి కట్టుబాట్లకు లోనైన సంఘం కనిపిస్తుంటుంది కొంత సేపటి వరకు ఆ విశాలమైన వరండాలో తన వెనుకవేపు జరుగుతున్న విశేషాలమీద దృష్టిపోలేదు ఎదరగా కూర్చున్నవాడు ఒకసారి అటు చూడమని సైగ చేసే వరకూ వెనుతిరిగి చూడలేదు.

ఇద్దరు కొత్తగా పెళ్ళయినజంట. ఆమె యింకా పెళ్ళి ముస్తాబుతోవున్నట్లే వుంది. జరీతో నిండిన యెర్రని చీర. బంగారు గాజులతోపాటు ఎర్రని గాజులు అతి నాజూగ్గా వుంది ఆమె. పటిక పంచదార చిలకలావుంది. చందమామ ఛాయతో, చేతిలో ధాన్యపు కొంకులతో నిల్చున్న లక్ష్మిలావుంది.

తన పెళ్ళి గుర్తుకు రాగానే రావు దృష్టి పేకాటమీద సన్నగిల్లింది. ఆటీను రాణి తన అద్దాలరాణీలా అగపడగానే సరి ఆడలేనని చెప్దామనుకున్నాడు. కానీ మర్యాదకు ఆడుతున్నాడు. రీతిని తప్పుతున్నాయ్ ముక్కలు. ఈ కొత్త జంట విదేశాలు పోతున్నారేమో! వాడి ప్రవర్తన చూస్తుంటే విదేశాల్లో మెసలి వచ్చిన వాడిలా వున్నాడు. ఎటువంటి సంశయం లేకండా యీ పెద్దల సమక్షంలో యింగ్లీషులో యింగ్లీషు పద్ధతిలో పెళ్ళాన్ని దగ్గరగా లాక్కుంటూ ప్రేమ వొలకబోస్తున్నాడు.

రావు ఒకసారి లేచి నిల్చునిచూసాడు. ఈ వరుడు యింతగా వుద్రేకంతో ఎగిరి పోతున్నది—కుంకుమబొట్టుతో కస్తూరిలా పరిమళిస్తున్న పెళ్ళాన్ని చూసికాదు. దిగువగా స్విమ్మింగ్‌పూల్‌లో విదేశవనితల విహారాన్ని చూసి. స్కాచ్‌విస్కీ అను కుని ఆస్వాదిస్తున్నాడు.

రావుకు చాలా అలవాట్లు వుండాలని ఆ రోజుల్లో పెళ్ళం కోరుకునేది తను సిగరెట్టు మానివేసినందుకు విసుక్కుంది. మళ్లీ తాగించాలని ప్రయత్నం చేసింది. ఆ యిల్లు నచ్చలేదు ఆ ఫర్నిచరు కాల్చేసింది. అసలు యీ దేశమే నచ్చలేదు. విదేశాల్లో వుండిపోదామనే యింత పెద్ద వుద్యోగస్తుడ్ని పెళ్ళాడానన్నది. అప్పటికి విదేశాలంటే విసిగినరావు కాదన్నాడు. ఆ రోజువింటే యిద్దరి మధ్యా యెడ ముఖాలు పెడముఖాలు—తగువుల వాతావరణం....

ఈ కొత్తజంట అతగాడికీ ఆమెకు వయసులో తేడా యిరవై యేళ్ళయినా వుంటుంది. అప్పుడే వాడికి పట్టబుర్ర వచ్చేస్తోంది. ముక్కు ఆ ముఖానికి పెద్దదే. ఆ పెదాలు మోటువే. అల్లిబిల్లిగా పెరిగిన యీ పిల్లను యే తలిదండ్రులు యీలాకాయిలా కాయిచేత పెట్టేసారో! ఐనా ఆ పెళ్ళికూతురు యౌవ్వనంలో ఆడది పువ్వులానే వుండాలని పోల్చుకున్నట్లుంది. మొగుడు అందిచ్చిన సీరూపాలూ రెండూ ఆమెకు రుచిగానే వుండి వుండాలి

రోజంతా సమస్యలతో నలిగి ఇంటికి వచ్చేసరికి తన యిల్లు కోరికల నరకంగా కనిపిస్తుంది. ఒకటి కావాలంటే అది రాటానికి కొంత ఆలస్యం జరిగిందీ అంటే తన చేతగాని తనం మిగతావాళ్ళ ప్రయోజకత్వం ముందు పెట్టి పెళ్ళం నానామాటలు కురిపించేది—రాను రాను యీ తత్వం పెరిగి ఓగాపీ తరగలేదు. ఎలాగో అడిగిన వస్తువు యింటోకి వచ్చేసరికి అంతకంటె విలువైన కోరికలతో మళ్ళీ జీవితం మామ్మూలే....

రావు యింక పేకాట ఆడలేకపోయాడు. ఒంటిగా ఒకమూల కూర్చొని యీ కొత్త పెళ్ళికూతురువేపు చూస్తూ యేవేవో భావాల జీవాల్లో మెసలుతూ కాస్సేపయినా తన యింటిని మరచిపోదామనుకున్నాడు. మిగతా ముగ్గురికీ పేకాటమీద మనసులేదు. ఆజంటమీదే దృష్టి. ఆమె పల్లెటూరి పడుచో లేక పల్లెటూరిలాంటి పట్నంవించో వచ్చి వుంటుందనుకున్నాడు. సహజమైన సిగ్గుతో వెలిగిపోతోంది. తేటనీరులా కనిపిస్తూ మొగుడ్ని తేజరిల్లే వెలుగు చేసుకుని ప్రతిబింబించుకుంటోంది. అలికిన అరుగుమీద పూసిన పూలగోలం పెట్టినట్లు వరండాలో నిల్చునివుంది.

తూరుపువేపు గుండ్రని ఫౌంటన్ చుట్టూ విరబూసిన పూలమొక్కలు. పూలతుప్పలను వదలని తేనెటీగలు.



విప్పిన గొడుగుల్లా విచ్చున్న చెట్టు కొమ్మల్లోనించి తొంగిచూస్తున్న చిలకలు. మైనాలు. చీకటిపడగానే రంగు రంగుల వెలుతురును చీల్చుకుంటూ పైకెగసే నీటిధారలు. వరండాలో నగిషీ కిటికీలమీద నమ్మకంగా కూర్చొని కునుకుతూ కులుకుతున్న పావురాలు.

ఈ వాతావరణంనించి "మైడియర్ డార్లింగ్" అంటూ నడుం నొక్కుతూ గదిలోనికి తీసుక పోయాడా భారతీయుడు. ముగ్గురి పరిపాలకుల బొమలు ఒకసారి పైకెగసాయి. చేతులు మూతులూ కదిలాయ్.

"ఇది పెళ్ళం అంటానులేక....?" ఒకాయన గొణిగాడు.

"అ(డెవ్....కొత్తగా పెళ్ళయి వుండాలి....?" రావు సమర్ధించాడు.

"హోటల్లో రూముకోసం.....యీ వేషం కాకూడదా?"

"ఆమె బజారు మనిషని పొరపాటునైనా వూహించడానికి...."రావు ఆమెను సమర్థించాడు.

"చూపులు చూసి మోసపోకండి"

"నాకంటికి ఆమె అసలైన...."రావు మాటలు పూర్తి చెయ్య నివ్వకుండా ఒకాయన "భారత నారీమణిలా వుందంటారు.

ఒక్కసారి ఆ వల్ల కళ్ళద్దాలు తీసి చూడండి. వాళ్ళిద్దరి వయసులో లేడా.... ఏ తండ్రీ అంత లేడాతో పిల్లను విసిరే స్తాడనుకోను ''

''వా డెలాంటి కష్టాల్లో వున్నాడో? వాడు విదేశాల్లో మంచి హోదాలో వుండ కూడదా?'' రావు యింకా సమర్థిస్తుంటే ''ఈ పెద్ద పట్టణాల్లో యెవరు యెవరో చెప్పుకోవటం చాలా కష్టం. ఎలానూ మూడురోజులుంటాంగా అసలు గుట్టు లాగుదాం'' అన్నాడొకాయన

''ఎలా వీలౌతుంది?'' రావుకు అప్నీ ప్రశ్నలే.

''అయితే హీరో అవ్వాలి చాతకాక పోతే విలన్‌గానైనా మారాలి. మధ్యే మార్గంలేదు ''

''వీళ్ళ సంసారంలో కత్తిపట్టుకుని ప్రవేశిస్తారా?'' ఈ ప్రశ్న నాలిక చివర వరకూ వచ్చినా ఆపేశాడు.

రావుకు నిద్దర పట్టలేదు. ఇంత చక్కని మానవ ప్రతిమను యింత సుందర ప్రదేశంలో యింత అమాయక మైన ప్రేమతో చూడగలిగినందుకు ఆనం దించకుండా. అభాండాలు వెయ్యటం తనకు నచ్చలేదు పరుపుమీద వాలినా ఆవిడే గుర్తుకొస్తోంది. కాస్సేపు తన జీవితం అంతా నెమరు వేసుకున్నాడు. వీధిలో తన చుట్టూవున్న మనుషులూ ఒకరీతిలేని శబ్దాలు, అపకతవకమనుషులు కాలికివేస్తే మెడకు, మెడకువేస్తే కాలికి బంధాలు వేసేవాళ్ళు, అపసవ్యాలు—ఈ రీతిలేని శబ్దాలనుంచి ఒక కమ్మని రాగంగా ఆలాపింప చేద్దామనే తన ప్రయ త్నంలో కనీసం కాస్త మనోవిబ్బరాన్ని ప్రసాదించే ప్రశాంత వాతావరణం యింట్లోలేదు. జీవితం డబ్బు యిచ్చే సుఖాల సుడిగాలిలో చిక్కుకుంది. లోకం తన ఒంటికి బురద అంటించింది. పెళ్లాం అది కడిగే గంగా ప్రవాహం కాలేదు. పెళ్ళాం ఒక ముళ్ళచెట్టే అనుకుంటే పోనీ ఒక తియ్యనిపండు లేక ఒక గులాబి పువ్వు—అవును ఆమె పళ్ళను రాల్చింది. నలుగురు బిడ్డలు వాళ్ళు ఆమెలా పుల్లనివళ్లే—ఒక్కటి గులాబి పువ్వు కాలేదు. తియ్యని పండుకాలేదు.

నిద్దరరాక బయటకు వచ్చాడు ఒరం డాలో ఒక్కడు. వెన్నెల వెలుగులో పచ్చని పట్టుచీర పమిట సవరించుకుం టున్న అన్నపూర్ణలా ప్రకృతి కని పిస్తోంది. కాస్సేపు యీ పచ్చని వరదాల ప్రపంచంలో ఒక్కడే....ఎవరికోనమో యెదురు చూస్తున్నట్లు నిల్చున్నాడు ఆ రూపు తను వూహించుకోవాలి, ఆ సుఖం రుచి తెలీదు. అది పాలవెల్లిలా అందనిది అనుకున్నాడు. ప్రయత్నిస్తే అది దొర కదు. ఆ పాలవెళ్ళ ఆకారం శబ్దం— కవనంలో, సంగీతంలో, చిత్రణలో అదృష్టవంతులకే దొరుకుతుంది. ఈ సుఖం అర్థంచేసుకున్న భార్యలో మగనికి దొరుకుతుంది!

ఇలా యేవేవో అనుకున్నాడు. ఈ వట్టబుర్ర పెళ్ళికొడుకు అలాంటి అదృష్టవంతుడు. అర్థంచేసుకుని ఆరాధించే యిల్లాలు దొరికింది. ఆమె అతని బురదను కడిగే గంగాప్రవాహం. ఆ మొరటుమనిషి కన్నీరు. ఆ ముళ్ళదొంకమీద వాసన పూవు.

రావు తలుపు తట్టాడు ఏడుస్తున్న ఆమె తలుపు తీసింది. ఇంకోలా సంభోదించలేకపోయాడు.

"ఎందుకేడుస్తున్నావు చెల్లీ' అని అడిగాడు.

"ఇంత రాత్రయింది. ఇప్పుడే వస్తానని వెళ్ళారు. ఇంకా రాలేదు''

''ఎక్కడికెళ్తున్నదీ చెప్పలేదా?"

"ఉహూఁ"

''దగ్గర డబ్బుందా?''

''పర్సు తీసుకు వెళ్ళాడు.''

"భోజనం చేశారా?'

''ఆయన వస్తారని చూస్తున్నాను."

"నే చూస్తాను. నువ్వు భోజనం చెయ్యి"

''ఆయనలేనిది....నాకు ఆకలిలేదు.''

ఆ ఏడుపు ఒక ప్రవాహంలా వస్తోంది. లోకంకోసం యేడ్చే కల్లిబొల్లి యేడుపు కాదు. ఆమె తపన హృదయంనించి

శక్తితో వస్తోంది. తన భార్యలా డబ్బు, హోదా చూసికాదు. ఒక చిన్న సంఘటన ఒక కొండంత అభిమానం——ఒక చిన్న మర తిప్పగా ఒక కొళాయివించి నీళ్ళ ధార పడినట్లు!

ఎలాగయినా యీ వుత్తమ యిల్లాలి భర్తను యీ రాత్రే ఆమె దగ్గరగా చేర్చాలన్నంత తపన చూచి మిత్రులు నవ్వారు. వేళాకోళం చేశారు. సాయంత్రం మేం అన్నది ఒక్కసారి గుర్తుకు తెచ్చుకోమన్నారు. వీళ్ళు మనకెందుకీ గొడవలు ఇందులో అనవసరంగా జోక్యం చేసుకోకు. చిక్కుకుంటే బయట పడలేవని అన్నారు. అప్పటికీ వినకపోతే నీ ఇష్టం అనేశారు.

రావు పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి రిపోర్టు యిచ్చాడు. తిరిగివచ్చాడు. ఆమె యింకా వెక్కి వెక్కి ఏడుస్తోంది. తలచి తలచి ఏడుస్తోంది. ఏమి జరిగివుండాలి? ఎన్నెన్నో కారణాలు వూహించుకున్నాడు.

ఆమె పరిస్థితి చూసి అతని రూపాన్ని వర్ణించి అన్ని పెద్ద ఆసుపత్రుల కేజుయాల్టీలకు ఫోన్ చేశాడు. రెండు నైట్ క్లబ్బుల్లోనికి వెళ్ళాడు. తిరిగి వచ్చేసరికి ఆమె పరిస్థితి బాగాలేదు. దగ్గరలేకపోతే యెటువంటి అఘాయిత్యం జరుగుతుందేమోనని దగ్గరగావుండే ధైర్యం చెప్పుతున్నాడు. ఎంత చెప్పతున్నా ఆమె అధైర్యం హెచ్చుతోందిగానీ తగ్గలేదు.

తెలతెలవారింది. ఇద్దరూ ఆమె గదిలో నిద్దరలేక సగం చచ్చి కూర్చున్నారు. మగడు మహారాజులా దిగబడ్డాడు. ఆమె ఆవేశంతో పక్కకు చేరితే వాడు అనుమానంతో రావువేపు చూస్తూ....

"ఎవడు వీడు? ఇక్కడెందుకున్నాడు?"

"ఆయన చాలా శ్రమపడ్డారు...." అందుకుంది ఆమె.

కోపంతో అక్కడేవున్న బల్ల గుద్దుతూ అతగాడు అరిచాడు "నా విషయాల్లో జోక్యం నిన్నెవరు చేసుకోమన్నారు?"

"మీ రేమయ్యారోనని ఏడుస్తుంటే..."

"ఏ మౌతాను? నా యిష్టంవచ్చిన దగ్గర కెళ్తాను. నాకు నచ్చినవాళ్ళ దగ్గర కెళ్తాను....వరకానికెళ్తాను...." ఇంకా ముందుకువెళ్తూ "నేను లేనప్పుడు నా పెళ్ళాం ఒకర్తేవుండగా నా గదిలోనికి చొచ్చినందుకు....పోలీసుకి యిప్పుడే ఫోను చేస్తాను" అంటూ ఫోనెత్తాడు.

రావు మెల్లగా గది బయటకు నడిచాడు. ముగ్గురు మిత్రులు తగినశాస్తి జరిగినందుకు నవ్వుతున్నారు. ఆ వరండా చివర నిల్చొని ఒక బేతింగ్ బ్యూటీ యిటే చూస్తోంది. తన గదిలోనికి వెళ్ళి గడియవేసి పరుపుమీద వాలాడు. కిటికీ వించి చూశాడు. తోటమాలి ఒక వాడిన పువ్వును తెంపిపారేశాడు. ఈ వయసులో కుటుంబ బాధ్యలతో తన భార్య పువ్వు కాలేదు. ఈ బాధ్యతల బరువుతో తను తేనెటీగ కాలేదు.

కనకపు సింహాసనం అందరికీ దొరకదు. దొరికినా కూర్చున్న వాళ్ళంతా మహారాజులు కాలేరు.

—